# కాపలా

ప్రియమైన నాన్నగారికి నమస్కారాలు!

నేను నిన్ననే ఉద్యోగంలో జేరాను. చిన్న మామయ్య నాకో రూమ్ చూశాడు. రాత్రి గృహప్రవేశం చేశాను.

మావయ్య అత్త వచ్చి, దేవుడి పటం కొని తెచ్చి, ముందుగా నాతో కొబ్బరికాయ కొట్టించి వెళ్లారు.

రూమ్ బాగానే వుంది! ఎటాచ్డ్‌బాత్‌రూం-

ఇంటి ఓనర్ కూడా మంచివాడిలాగే ఉన్నాడు.

పేరు నరసింహారెడ్డి- నరసింహం కాదేమోలెండి!

ఫేనూ... ట్యూబ్‌లైట్ విప్పకుండానే నాకు రెంట్‌కిచ్చాడు. వాటర్ టేంక్ కిందనే నా రూమ్ గనక చల్లగా ఉంటుంది!!

కరెంటుకీ వాటర్‌కీ అన్నింటికీ కలిపి తొమ్మిది వందలు అడిగాడు- సరే అన్నాం- మావయ్య ఇంటికి దగ్గరగా ఉంటుంది. ఏమన్నా పని పడినా పక్కనే వుంటారుగా అని కాస్త అద్దె ఎక్కువైనా ఒప్పేసుకున్నాము. అమ్మ ఎలా వుంది. అడిగానని చెప్పు- ఇప్పట్లో వంట పెట్టాలని లేదు- మావయ్య ఇంట్లోనే తింటున్నాను- జీతం వచ్చాక ఎంతో కొంత ఇస్తాను.

ఇట్లు

మీ పెద్దబాబు...

అన్నట్లు నా అడ్రస్: కేరాఫ్ కె.ఎస్. నరసింహారెడ్డి, 1-12-10-557, మైలార్‌గడ్డ, రాజారామ్‌నగర్ కాలనీ, సికింద్రాబాద్-500 061.

✦ ✦ ✦

శ్రీ నరసింహారెడ్డిగారికి... నమస్కారాలు!!

నేనెవరో మీకు తెలియదు. నా పేరు కృష్ణయ్య. రాజమండ్రిలో వుంటాను. మా అబ్బాయి చి. శశిధర్ మీ ఇంట్లో అద్దెకి దిగాడని తెలిసింది. మీ గురించి నాకు ఎక్కువ తెలియదు. ఒక తండ్రిగా మీకొక చిన్న ప్రార్థన- మావాడు... కొంతకాలంగా నా చెప్పుచేతల్లోలేడనే అనుమానం ఉంది. అయినా నేను దగ్గరఉంటే.. వాడిని సరిదిద్దేవాణ్నేమో! ఇప్పుడు వాడికి ఉద్యోగం వచ్చింది. సర్వస్వతంత్రుడు అయ్యానన్న అభిప్రాయం వుంటుంది!!

అక్కర్లేనంత జీతం- హద్దుల్లేనంత జీవితం వాడికొచ్చి ఉంటుంది- ఇలాంటి పరిస్థితుల్లో... నాన్నలాంటి మీరు వాడికి కాపలాగా ఉండాలి అని నా ఆశయం- ఆశ! దయచేసి మీరు వాడిని ఓ కంట కనిపెట్టి చూడమని కోరుతున్నాను. నా చిరునామా... ఎన్.ఆర్. ఆంజనేయులు, మహాలక్ష్మి గుడి వీధి, పాలకొల్లు- పశ్చిమ గోదావరి జిల్లా.

ఇట్లు

మీ విధేయుడు ఆంజనేయులు.

ఒక్కక్షణం: నేనీ ఉత్తరం రాసినట్లు దయచేసి మా అబ్బాయికి తెల్పవద్దు.

✦ ✦ ✦

శ్రీ ఆంజనేయులుగారికి నమస్కారాలు.

మీరు రాసిన ఉత్తరం అందింది. మీ అబ్బాయికి రూమ్ అద్దెకిచ్చానుగానీ.. నేనా రూమ్‌ను పూర్తిగా ఇవ్వలేదు. నేను మీరు చెప్పినట్లు రోజూ వెళ్లి మీ వాడిని కనిపెట్టుకుని వుండటం కష్టమని అద్దె తొమ్మిది వందల్నుంచి... అయిదు వందలు చేశాను-

నేను ఆ రూమ్‌లో పడుకోడానికి వొప్పందం చేసుకున్నాను. ఇంక మీవాడి గురించి నిశ్చింతగా వుండచ్చు.

మీ

నరసింహారెడ్డి.

✦ ✦ ✦

ప్రియమైన నాన్నగారికి నమస్కారాలు.

మీ ఉత్తరం అందింది! ఇంటి ఓనర్‌గారు మా ఇంట్లోనే పేయింగ్ గెస్టుగా ఉండవయ్యా అన్నారు. రెండుపూట్లా భోజనం- ప్రొద్దుటే టిఫెనూ ఇస్తారు. నేను వప్పుకున్నాను. కానీ దానికి 400 రూపాయలు వసూలు చేస్తుంటార్ట. అయితే ఇంటి అద్దె తక్కువ చేసారు. అమ్మ ఆరోగ్యం బావుందని తలుస్తాను.

ఇట్లు

మీ పెద్దబాబు

పి.ఎస్: అయితే ఓ చిన్న ఇబ్బంది వుంది.. ఓనరుగారు రాత్రిపూట నా రూమ్‌లో పడుకుంటున్నారు. పోనీకదా అని వప్పుకున్నాను.

✦ ✦ ✦

శ్రీ నరసింహారెడ్డిగారికి ఆంజనేయులు నమస్కరించి వ్రాసేది-

ఉభయకుశలోపరి!!

మా వాడికి మీరు చేస్తున్న సాయానికి కృతజ్ఞతలు!!

మీరు వాడికి అన్నం పెట్టటంతోబాటు తోడు పడుకుంటున్నందుకు నేను మీకు లక్షలాది కృతజ్ఞతలు చెప్తున్నాను!!

✦ ✦ ✦

నాన్నగారూ... నరసింహారెడ్డిగారు చనిపోయారు.

నా రూమ్‌లో... హాయిగా పడుకున్నాడు- ఆయన అలాగే పోయాడు. అందుకు కారణం నాకు అర్థం కావట్లేదు... కానీ గొడవయ్యేలాగే ఉంది... మళ్లీ లెటర్ రాస్తాను...

మీ పెద్దబాబు.

✦ ✦ ✦

సార్ నమస్తే!

మిమ్మల్నెప్పుడూ చూళ్లేదు. కానీ... మీకు నేనో కొత్త కథని చెప్పక తప్పదు- మీ అబ్బాయి ప్రవర్తన గురించి... నేను గూఢచారిగా ఉండటం నేను చేస్తున్న తప్పులా అనిపిస్తోంది.

అతని స్వేచ్ఛకీ ఆనందానికీ నేను ముద్దాయిగా కనిపిస్తుంటాను!

ఇట్సొకే... నన్ను క్షమించండి!

నేను మీ అబ్బాయిని మీలాగే... అచ్చం మీలాగే రక్షించలేక పోతున్నాను!

-నరసింహారెడ్డి

✦ ✦ ✦

జవాబు ఎవరికి రాయాలి? అంతు తెలీని జాబుని.. చదువుకున్న ఆంజనేయులు కొడుకుని హంతకుడిగా చూడాలా? అని కల్లోల మనస్కుడై ఉన్నాడు.